క్లుప్తంగా

సీఎంను కలిసిన కాంతారావు



మహారాణిపేట : గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొడానికి విశాఖ వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు జ్ఞాపికను అందజేశారు.

నేడు వాకర్స్‌కు ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతంలో వాకర్స్‌కు ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరగనుంది. ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముడసర్లోవ పార్కు సమీపం హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవెలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ పక్కన వాకర్స్ క్లబ్‌లో శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి శనివారం తెలిపారు. ఉదయం 6 గంటలు నుంచి 8.30 గంటలు వరకు జరగనున్న శిబిరంలో అను ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇక్కడ బీపీ, మధుమేహం పరీక్షలతో పాటు కిడ్నీ సంబంధిత కన్సెల్టెన్సీ చేయనున్నారన్నారు. వాకర్స్ ఈ అవకాశం సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు.

ఏయూకు తోడ్పాటు అందించండి



నిధిజైన్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఎడ్యునెట్ ఫౌండేషన్స్‌గవర్నమెంట్ రిలేషన్స్–పార్టనర్ షిప్ విభాగాధిపతి నిధి జైన్ సందర్శించారు. శనివారం ఏపీసీటీఈ చీఫ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ద చంద్రశేఖర్ సమక్షంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బోధన, పరిశోధన, స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాలలో ఏయూ సాధిస్తున్న ప్రగతిని వీసీ స్వయంగా వివరించారు. ఈ ప్రక్రియలో ఏయూకు సహకారం అందించాలని కోరారు. సంస్థ సామాజిక బాధ్యతగా ఏయూలో మౌలిక వసతుల కల్పనలో తోడ్పాటును అందించాలని కోరారు. అనంతరం ఏయూ తరపున నిధిజైన్‌ను సత్కరించారు.

సింహగిరి అభివృద్ధికి కేంద్ర సహకారం



మంత్రులు శర్బానంద్, కిషన్ రెడ్డిని సత్కరిస్తున్న గంట్ల శ్రీనుబాబు

బీచ్‌రోడ్డు: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకారం అందిస్తుందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ప్రసాద్ స్కీం కింద ఇప్పటికే రూ.54 కోట్లు కేంద్రం మంజూరు చేసినట్లు చెప్పారు. పెట్టుబడుల సదస్సులో పాల్గొనడానికి నగరానికి వచ్చిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, శర్బానంద్ సోనోవల్‌ను శనివారం సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులకు సింహాద్రినాథుడి జ్ఞాపికలు బహూకరించారు. సింహగిరి ఆలయ అభివృద్ధికి కేంద్రం నుంచి మరింత తోడ్పాటును అందించాలని శ్రీనుబాబు కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

సమ్మిట్ సందడి



సచివాలయ సిబ్బంది సెల్ఫీ

- రెండో రోజు అదే జోష్
- జీఐఎస్ సదస్సు విజయవంతం

ఏయూక్యాంపస్: విశాఖ వేదికగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రెండో రోజు శనివారం విజయవంతంగా ముగిసింది. సదస్సులో పాల్గొనడానికి ఉదయం నుంచి పెద్దసంఖ్యలో పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.

ప్రవేశ మార్గం వద్ద ప్రతీ ఒక్కరిని గుర్తింపు కార్డులు, క్యూఆర్ కోడ్‌ను పరిశీలించి లోపలికి అనుమతించారు. సదస్సు ప్రాంగణంలో పోలీసులు బాంబ్ స్క్వాడ్, స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. సదస్సు నిర్వహణలో ఎటువంటి భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా పోలీసులు ప్రశంసనీయ పాత్ర పోషించారు.

సదస్సు విజయవంతం

రెండు రోజుల జీఐఎస్ సదస్సు పూర్తి స్థాయిలో విజయవంతమైంది. పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు రెండో రోజు సైతం హాజరయ్యారు. విభిన్న వేదికలపై ఏకకాలంలో పెట్టుబడులకు సంబంధించి పారిశ్రామిక వేత్తలు ఎంవోయూలు కుదుర్చుకున్నారు. వచ్చిన లక్ష్యం నెరవేరడంతో సదస్సుకు వచ్చిన పారిశ్రామిక వేత్తల్లో జోష్ కనిపించింది. పలువురు పారిశ్రామిక వేత్తలు సదస్సు ప్రాంగణంలో సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టడానికి యువత రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం స్టాల్ మంచి ఆదరణ పొందింది. వార్డు/గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రత్యేకతలను వివిధ దేశాల ప్రతినిధులకు సిబ్బంది వివరించారు. ఏపీలో సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలను ప్రతినిధులు ప్రశంసించారు.

విద్యార్థుల సందడి

సదస్సులో రెండో రోజున విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. దీంతో ఏయూతో పాటు నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో జరుగుతున్న ఎంవోయూలు, సెషన్స్‌ను వీక్షించడానికి, నూతన జ్ఞానాన్ని పొందడానికి ఆసక్తి చూపారు. దీంతో సమ్మిట్ ప్రాంగణం విద్యార్థులతో కళకళలాడింది. మేనేజ్‌మెంట్, టెక్నాలజీ రంగాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విదేశీ విద్యార్థులు సైతం హాజరయ్యారు.



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు వస్తున్న ప్రతినిధులు

నెట్‌వర్క్ డెవలప్‌మెంట్

విభిన్న రంగాలలో పనిచేస్తున్న నిపుణులు తమ నెట్‌వర్క్‌ను డెవలప్ చేసుకోవడానికి ఈ సదస్సును వేదికగా మలుచుకున్నారు. విభిన్న సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, నిర్వాహకులతో కలసి మాట్లాడారు. తాము పనిచేస్తున్న రంగాలను ఆయా సంస్థలతో అనుసంధానించే దిశగా చర్చలు జరిపారు. పరోక్షంగా అనేకమంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఈ సదస్సు ఒక మంచి వేదికగా నిలచి వారి పరిధిని విస్తృతం చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది.

భారతీయ కళలకు ఫిదా

పలువురు భారతీయ కళలకు ఫిదా అయ్యారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన బొబ్బిలి వీణ నుంచి శ్రావ్యంగా వచ్చే సంగీతాన్ని వింటూ విదేశీయులు తన్మయత్వానికి లోనయ్యారు. సర్వసిద్ధి లక్ష్మణ స్వామి బొబ్బిలి వీణపై శ్రావ్యంగా స్వరాలను పలికిస్తుంటే విదేశీయులు తమ సెల్‌ఫోన్లతో వీటిని చిత్రీకరించారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. యలమంచిలికి చెందిన జయవాణి అక్కడిక్కడే తాటాకుతో దండలు తయారు చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. తోలు బొమ్మలు, హస్తకళా రూపాలు, చేనేత వస్త్రాలను చూడడానికి భారతీయులతో పాటు, విదేశీయులు ఆసక్తి చూపారు.



విదేశీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఔత్సాహికులు



బొబ్బిలి వీణను కెమెరాలో బంధిస్తున్న విదేశీయులు

సీతంరాజు గెలుపు కోసం ప్రచారం



కరపత్రాలు పంచుతున్న అక్కరమాని

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు పార్టీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి 15వవార్డులో విస్తృత ప్రచారం చేశారు. వార్డులో గల పట్టభద్రులైన ఓటర్ల వద్దకు వెళ్లి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

23వ వార్డులో..

వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అంతా కృషి చేయాలని 23వ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు వార్డులో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19వ వార్డులో...

ఎంవీపీకాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిని సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శనివారం రాత్రి 19వ వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ కారి శ్రీలక్ష్మి, సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, వసంత తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక శాస్త్రం బోధనకు సులువైన పద్ధతులు అవసరం



సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల లెర్నింగ్ శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

ఆరిలోవ: సాంఘిక శాస్త్రం బోధనలో ఉపాధ్యాయులకు సులువైన పద్ధతులు అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లాలో ఉపాధ్యాయులకు సబ్జెక్టులు వారిగా శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా చినగదిలి, భీమిలి మండలాల్లో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సాంఘిక శాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయులకు శనివారం తోటగరువు హైస్కూల్‌లో 'లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం' పేరుతో ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణను డీఈవో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా ఉండాలన్నారు. ప్రతి అంశంపై సాంఘిక శాస్త్రంతో ముడిపడి ఉందన్నారు. భౌగోళిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాల్లో మంచి పట్టు ఉండాలన్నారు. అలాంటి ఉపాధ్యాయులే తరగతి గదిలో విద్యార్థులను మెరుగుపరచగలరన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ బి.శ్రీనివాసరావు, తోటగరువు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జీకే దుర్గాభవాని, డైట్ అధ్యాపకురాలు హరిణి, రీసోర్స్ పర్సన్లు ఎస్.లివింగ్‌స్టన్, బి.బాలాజీ, ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ ఉమావతి, నాగేశ్వరరావు

మహారాణిపేట : బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం పలువురు వైద్యులు పలు స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం కార్యక్రమంలో భాగంగా శనివారం నాల్గవ రోజు ప్రపంచ హెల్త్ సంస్థ వైద్యురాలు డాక్టర్ ఉమావతి, జిల్లా విస్తరణ మీడియా అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు మహారాణిపేట, రామ్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న స్కానింగ్ కేంద్రాలను, అపోలో ఆస్పత్రిలో ఉన్న స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ నిర్ధారణ చేయరాదని ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ సమత, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండండి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ గరికపాటి గురజాడ

ఏయూక్యాంపస్ : సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారితే మానసిక ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుందని ప్రముఖ ప్రవచన కర్త డాక్టర్ గరికపాటి గురజాడ అన్నారు. శనివారం ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో నిర్వహించిన 'సోషల్ మీడియా ఎడిక్షన్'పై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురజాడ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలలో వచ్చే అంశాలు కాస్త ఆనందాన్ని కలిగించినా, పరోక్షంగా మన మెదడుపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఏకాగ్రత పెరగడానికి, అభ్యసన నైపుణ్యాలు మెరుగుపడడానికి సెల్‌ఫోన్, కంప్యూటర్‌లకు దూరంగా ఉండటం ఎంతో అవసరమన్నారు. ఆంగ్ల భాషల్లో రచించిన పుస్తకాన్ని ఏయూ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ చల్లా కృష్ణవీర్ గదబ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య చల్లా రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ పి.కిషోర్ కుమార్, డాక్టర్ ఆర్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



ఉత్సవమూర్తులకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిత

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): వాణిజ్య శాస్త్రం అభ్యసించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ స్టాక్ ఎంక్స్ఛేంజ్ వారిచే మూడురోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. బీకామ్ అభ్యసించే విద్యార్థులకు ఎంటర్‌ప్రైన్యూర్స్, ఇన్సురెన్స్ కోర్సు వలన ఉపాధి అవకాశాలుంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ కామర్స్ కోర్సు అభ్యసిస్తే ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయో వివరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ స్టాక్ ఎంక్స్ఛేంజ్ అకాడమీ హైదరాబాద్ బ్రాంచ్ మేనేజర్ సంతోష్, నాయుడు, కామర్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

700 రోజులకు చేరుకున్న దీక్షలు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌ను విక్రయిస్తామని చెప్పి ఏడు వందల రోజులైనా మోదీ ప్రభుత్వం ఒక్క శాతం కూడా ఆ పని చేయలేకపోయిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్టీల్‌ప్లాంట్ జేఏసీ చైర్మన్ సీహెచ్ నర్సింగరావు అన్నారు. దీనికి ప్రధాన కారణం అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, ప్రజలు పోరుబాట పట్టడమే అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా చేస్తున్న దీక్షలు 700వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ ఉత్పత్తులు తగ్గించి నష్టాల్లో నడుస్తున్నట్లు చూపించాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అత్యాధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన మూడో బ్లాస్ట్‌ఫర్నేస్ ఉత్పత్తిని ఆపేసారని, రోలింగ్ మిల్‌ను కూడా స్తంభింపజేసి నష్టాల్లోకి నెట్టేస్తున్నారని అన్నారు. దేశంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు డిజిన్వెస్ట్‌మెంట్‌కు గురయ్యాయని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ఒక్క శాతం కూడా డిజిన్వెస్ట్‌మెంట్‌కు గురి కాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అప్పారావు, ఆర్కే ఎస్వీకుమార్, మన్మథరావు, వెంకటరెడ్డి, రాజు, నూకరాజు, లక్ష్మి, జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రీతికి కొవ్వొత్తు నివాళి



కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న గిరిజన వసతిగృహం విద్యార్థులు

ఎంవీపీకాలనీ : వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన ప్రీతి మరణానికి కారకుడైన సైఫ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలని గిరిజన ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన బాలికల వసతిగృహంలో నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తుల వెలిగించి ప్రీతికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ మధుకుమార్ మాట్లాడుతూ ప్రీతి మరణం వెనుకవున్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ అయిన గిరిజన యువతి ఆత్మహత్య చేసుకుందనే ఆరోపణలు నిజం కాదన్నారు. ప్రీతి మరణానికి కారకుడైన సైఫ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవాలి

దాబాగార్డెన్స్: ప్రజాస్వామ్య వాదులంతా న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవడానికి ముందుకు రావాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం న్యాయవ్యవస్థ స్వతంత్రత–సవాళ్లు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు బీవీ రామాంజనేయులు మాట్లాడుతూ న్యాయవ్యవస్థను లొంగదీసుకోడానికి మోదీ ప్రభుత్వం చేపడుతున్న కుటిల యత్నాలను దుయ్యబట్టారు. గొప్పగొప్ప న్యాయకోవిదులు ఎంతో శ్రమించి దూర దృష్టితో భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అటువంటి రాజ్యాంగాన్ని ఇప్పుడు రాజ్యాంగబద్ధంగా ఎన్నికై రాజ్యాంగానికి కట్టుబడి ఉండి, దానిని అమలు చేస్తానని ప్రమాణం చేసిన దేశ ఉపరాష్ట్రపతే రాజ్యాంగ వ్యవస్థ మౌలిక సూత్రాలను సవాలు చేయడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సహా అన్ని స్థాయిల్లో న్యాయమూర్తుల నియామకాలను నిర్ణయించే కమిటీలో ప్రభుత్వ ప్రతినిధి ఉండి తీరాల్సిందేనన్నారు. ప్రస్తుతం ఉన్న కొలీజియం వ్యవస్థను మార్చి వేయాలని న్యాయశాఖ మంత్రి ప్రతిపాదించడం తీవ్ర గర్హనీయమన్నారు. ఒకసారి న్యాయమూర్తుల నియామకాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడానికి అవకాశం ఇస్తే అక్కడితో మన న్యాయ వ్యవస్థ తన స్వతంత్రతను కోల్పోతుందన్నారు. అలాగే తాజాగా రిటైర్ అవుతున్న జడ్జీలకు గవర్నర్ పదవులను ఎరగా చూపి ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్న జడ్జీలను తమకు అనుకూలంగా వ్యవహరించేటట్టు చర్యలు చేపడతున్నారని ఆరోపించారు. ఇది న్యాయవ్యవస్థపై ప్రజలకు గల విశ్వాసాన్ని దెబ్బ తీస్తుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మనకు ఎంతో గర్వకారణమైన న్యాయవ్యవస్థ స్వతంత్రతను పదిలంగా కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య వాదులంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

వెంకటాద్రికి ఉచిత బస్సు సౌకర్యం



బస్సుకి పూజ చేస్తున్న అంబికా గణేష్, ప్రధానార్చకుడు రామానుజమ్

సింహాచలం: పెందుర్తిలోని వెంకటాద్రికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం భక్తుడు, అంబికా స్వీట్స్ అధినేత గణేష్ కొత్త బస్సు కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి శనివారంతో పాటు ప్రత్యేక ఉత్సవాల రోజుల్లో భక్తు లను వెంకటాద్రిపైకి ఉచితంగా తీసుకెళ్లి తీసుకువస్తారు. వెంకటాద్రిపై శనివారం బస్సుకు ఆలయ ప్రధానార్చకుడు రామానుజమ్ పూజలు నిర్వహించారు. అనంతరం అంబికా స్వీట్స్ అధినేత గణేష్ బస్సును ప్రారంభించారు. ప్రధానార్చకుడు రామానుజమ్ మాట్లాడుతూ వెంకటాద్రికి భక్తుల రద్దీ విశేషంగా పెరగడంతో బస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.